విశాలాంధ్ర
→ విశాఖపట్నం
→ అనకాపల్లి
→ అల్లూరి సీతారామరాజు

మణిపూర్ చిచ్చుకు బీజేపీయే కారణం

సీపీఐ జిల్లా కార్యదర్శి పైడిరాజు

విశాలాంధ్ర - తగరపువలస: మణిపూర్‌లో రెండు నెలలకుపైగా జరుగుతున్న హింసాకాండను అక్కడి బీజేపీ ప్రభుత్వమే నడిపిస్తున్నదని సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు విమర్శించారు. బుధవారం తగరపువలస సీపీఐ కార్యాలయం జీఆర్ భవనంలో జరిగిన పార్టీ ఏరియా సమితి సమావేశంలో పైడిరాజు మాట్లాడారు. 'మతహింస కాదు, కేవలం రెండు మతాల మధ్య హింసాయుత పోరాటం కాదు' ఇందులో భూమి, వనరులు లాంటివి ప్రధాన అంశాలు ఇమిడి ఉన్నాయని, ఇందులో మత మౌఢ్యులు, మిలిటెంట్లు పాల్గొంటున్నారని ఆరోపించారు. ఆక్రమణ భూమి పేరుతో న్యూచెకాన్ నిర్మాణంలో ఉన్న మూడు చర్చిలను ప్రభుత్వం కూల్చి వేసిందన్నారు. కంగ్పొక్పి, తెంగాపాల్ ప్రాంతాల నుండి అక్కడ నివసిస్తున్న కుకీల ఇళ్లను ఖాళీ చేయించి కూల్చి వేసిందని, అడవులు, వన్యప్రాణుల పరిరక్షణ పేరుతో కుకీలను వెళ్లగొట్టి వారిని అనాథలను చేశారన్నారు. రాష్ట్రంలో రాజ్యాంగ సంస్థలు పనిచేయలేదని, మణిపూర్ ఘటనపై ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. రాష్ట్రాన్ని రక్షించండి - దేశాన్ని కాపాడండి అనే నినాదంతో ఆగస్టు 16 నుండి సెప్టెంబర్ 6వ తేదీ వరకు సీపీఐ రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాలలో బస్ యాత్ర నిర్వహిస్తోందన్నారు. 16వ తేది ఉదయం 10 గంటలకు విశాఖ కూర్మన్నపాలెం ప్రధాన ద్వారం వద్ద నుండి బస్ యాత్ర ప్రారంభమవుతుందన్నారు. మోర అప్పలరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అల్లు బాబురావు, కానూరి రాంబాబు, తూతిక సోమరాజు, నూలు ఆదినారాయణ, పల్లా లక్ష్మణరావు, అల్లం గోవింద్, మాదాబత్తుల రామారావు, గోవాడ సూర్యనారాయణ, చిల్ల రాంపైడి తదితరులు పాల్గొన్నారు.

58వ వార్డులో జగనన్న సురక్ష

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి 58వ వార్డులో జగనన్న సురక్ష కార్యక్రమం బుధవారం నిర్వహించారు. వైసీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ 58వ వార్డును రాబోయే రోజుల్లో మోడల్ వార్డుగా తీర్చిదిద్దుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యులు, టౌన్ ప్లానింగ్ చైర్మన్ గులిగిందాల లావణ్య, వార్డ్ అధ్యక్షులు గులిగిందాల కృష్ణ, నీలకంఠేశ్వర రెడ్డి, ఏపీడీ చిరంజీవి, శ్రీనివాస్, ఆర్వో, ఏఈ సత్యనారాయణ, వేణుగోపాల్ రెడ్డి, పెద్దాడ రమణ, తోనంగి రమణి, ఎదురు రాజు, చుక్క వరలక్ష్మి, శ్రీనివాస్ రాజు, పెద్దాడ అప్పలరాజు, వరహాలు సత్యనారాయణ, రెడ్డ్ గుమ్మిడి సత్యనారాయణ, కృష్ణమూర్తి, ఒదురు లక్ష్మి, అప్పలరెడ్డి, సత్యవతి, కంద్రపు రాము, తాడి సత్యనందం, కన్నబాబు, జగన్నాథం, బర్రి సంతోష్, కోట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంపంగి గెడ్డ వంతెన నిర్మాణానికి శంకుస్థాపన

విశాలాంధ్ర - డుంబ్రిగుడ: మండలంలోని కించుమండ పంచాయతీకి ఆనుకొని ఉన్న సంపంగి గెడ్డ వంతెన నిర్మాణానికి అరుకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌లు శిలాఫలకాన్ని ప్రారంభించి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నాలుగు కోట్ల నలభై లక్షలు నిధులు మంజూరు చేసిందని ఆయన తెలిపారు. వంతెన నిర్మాణ పనులు మరికొద్ది రోజుల్లో ప్రారంభమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఐటీడీఏ పీఓ అభిషేక్, ఈఈ వేణుగోపాల్, డీఈఈ ఎంవిఎస్ సుబ్బారావు, జేఈఈ అభిషేక్, ఎంపీడీవో ఉషారాణి, తహశీల్దార్ నాగమ్మ, ఎంపీపీ ఈశ్వరి, జెడ్పీటీసీ జానకమ్మ, కితలంగి సర్పంచ్ సుబ్బారావు, కించమండ సర్పంచ్ చెల్లమ్మ, మండల వైసీపీ నాయకులు సింహాచలం, కృష్ణారావు, శ్రీరాములు, చిరంజీవి, గణపతి తదితరులు పాల్గొన్నారు.

కార్బన కాలుష్యాన్ని ఇంధనంగా మార్చవచ్చు

విశాలాంధ్ర - మధురవాడ: పరిశ్రమలు, వాహనాల నుంచి నిత్యం వెలువడే కర్బన కాలుష్యం నుంచి ఇంధనాన్ని తయారు చేసుకుని ప్రపంచం ఎదుర్కొంటున్న గ్రీన్ హౌస్ వాయువుల సమస్యలకు చెక్ చెప్పవచ్చునని ప్రపంచ ప్రఖ్యాత రసాయన శాస్త్రవేత్త, అమెరికాలోని లాస్ ఏంజల్స్‌లో గల లాకర్ హైడ్రోకార్బన్ రీసెర్చి ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ ప్రొఫెసర్ జి.కె.సూర్యప్రకాష్ వెల్లడించారు. ప్రపంచ పారిశ్రామిక విప్లవం తరువాతం కర్బన ఉద్గారాల శాతం క్రమేపి పెరిగి నేడు మానవాళి మనుగడకే ముప్పుగా పరిణమించిందన్నారు. గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కె.ఎస్.కృష్ణ, ఫ్యాకల్టీ దవలప్‌మెంట్ విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ జి.వి.ఆర్. శర్మ, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వేదవతి తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్ జెండర్ల హక్కులు పరిరక్షించాలి: సీపీ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ నేర పరిశోధన విభాగం (సీఐడీ) స్వాభిమాన్ ట్రాన్స్‌జెండర్ పర్సన్స్ ప్రొటెక్షన్ హెల్ప్‌లైన్ నంబర్ 1091ను ఈ నెల 19వ తేదీన ప్రారంభించింది. అందులో భాగంగా బుధవారం నగర పోలీస్ కమిషనర్ డా.సి.యం. త్రివిక్రమ వర్మ నగర పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో స్వాభిమాన్ యొక్క టోల్ ఫ్రీ నెంబర్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. డా.సిస్టర్ అమితా, నీ తోడు సొసైటీ ఫర్ ట్రాన్స్‌జెండర్ పర్సన్స్ మాట్లాడుతూ ప్రతి మనిషికి గౌరవంగా జీవించే హక్కు ఉందని, ట్రాన్స్‌జెండర్ పర్సన్స్ కూడా సమాజంలో భాగమని వారి హక్కులను పరిరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర పోలీసు ఉన్నతాధికారులు, ఏసీపీలు, స్టేషన్ ఎస్.హెచ్.ఓలు, ట్రాన్స్‌జెండర్ పర్సన్స్ పాల్గొన్నారు.

1200 కేజీల గంజాయి పట్టివేత

విశాలాంధ్ర - ముంచంగిపుట్టు: రెండు లక్షల విలువ చేసే 1200 కేజీల గంజాయిని జోలాపుట్ పంచాయతీ లబ్బురు జంక్షన్ వద్ద పట్టుకున్నారు. బొలెరో వాహనం, ఒక మొబైల్ ఫోన్ స్వాధీనపరుచుకున్నామని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపారు. లబ్బురు జంక్షన్ వద్ద తమ సిబ్బంది మాట వేసి ఉండగా బరడవైపు నుండి ఓఆర్ 02 బిఈ 6479 బొలెరో వాహనంను ఆపి తమ సిబ్బంది తనిఖీలు నిర్వహించగా 10 ప్లాస్టిక్ సంచులలో గంజాయి ఉన్నట్లు గుర్తించి ఒక నిందితుడిని అదుపులో తీసుకు న్నామని మరో నిందితుడు పరారయ్యాడని తెలిపారు. మాకవరం పంచాయతీ లభడపుట్టు గ్రామానికి చెందిన వంతల హరిగా నిర్ధారించామన్నారు. గంజాయిని స్వాధీన పరుచుకున్న విషయం మండల తహశీల్దార్ నరసమ్మకు సంప్రదించగా ఇద్దరు వీఆర్వోలను పంపించడంతో వారి సమక్షంలోనే గంజాయిని పరిశీలన చేసి పది సంచులు ఉన్న గంజాయి 1200 కిలోల గంజాయి ఉన్నట్లుగా నిర్ధారించామన్నారు. నిందితుడిని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై రవీంద్ర, ఏఎస్‌ఐలు పి.తిరుపతిరావు, లక్ష్మయ్య, హెడ్ కానిస్టేబుల్ సతీష్ పాల్గొన్నారు.

ఆధారాలు ఉంటేనే ఓటు తొలగింపు

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ఓటును తొలగించాలంటే స్పష్టమైన పూర్తి ఆధారాలు ఉండాలని జిల్లా అదనపు ఎన్నికల అధికారి, డిఆర్ఓ పి.వెంకటరమణ తెలిపారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన రాజకీయ పార్టీల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బూత్ స్థాయి ఏజెంట్ కచ్చితంగా ఆ బూత్‌లో ఓటరై ఉండాలన్నారు. బీఎల్ఓ వెంట రాజకీయ పార్టీల వాళ్లు, వాలంటీర్లు వెళ్ళరాదన్నారు. ఓటు రద్దు చేయడానికి కుటుంబ సభ్యుల సంతకంతో ఫారంబి-7 తప్పక తీసుకోవాలన్నారు. నోటీసు సంబం ధిత ఇంటికి సచివాలయంలో అంటించడం జరుగుతుందన్నారు. ఆధార్ నెంబర్ లేకపోయినా నివాసమున్న చోట బ్యాంక్ ఎకౌంటు, గ్యాస్ నెంబర్, ఎలక్ట్రిక్ బిల్లు మొదలైన వాటితో ఓటు నమోదు చేసుకొనివచ్చని చెప్పారు. పట్టణాల్లో అపార్ట్మెంట్ డోర్ నెంబర్‌కు సంబంధించి వివరణ ఇస్తూ డోర్ నెంబర్ తర్వాత 1ఏ, 1బి క్రమంలో నెంబర్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ లక్ష్మీదేవి, డిటి రవి కుమార్, రాజకీయ పార్టీల ప్రతినిధులు గొర్లె సూరిబాబు (వైయస్సార్సీపి), రాజన దొరబాబు (సిపిఐ), వియ్యపురాజు (సిపిఐ), బొలిశెట్టి శ్రీనివాసరావు (టిడిపి) కొణతాల హరినాధ బాబు (ఆమ్ ఆద్మీ) డి.సంతోష్ (కాంగ్రెస్) సి.నాగేశ్వరరావు (బిజెపి), ఎస్.వి.వి.రామచంద్రరావు (బిఎస్పీ) తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు శ్రీప్రకాష్ విద్యార్థులు

విశాలాంధ్ర - పాయకరావుపేట: నేషనల్ యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారిచే పరవాడ మండలం వెన్నెలపాలెం గ్రామంలో ఈనెల 25న నిర్వహించిన అండర్ -14 యోగా పోటీల్లో స్థానిక శ్రీప్రకాష్‌కు చెందిన విద్యార్థులు బి.దేవాన్ష్ నాయుడు, పి.సోహాస్ చక్కని ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను విద్యా సంస్థల అధినేతలు సీహెచ్‌వికె నరసింహారావు, సీహెచ్ విజయ్ ప్రకాష్, ప్రిన్సిపాల్ ఎంవివిఎస్ మూర్తి, హెచ్ఎంలు అపర్ణ, నీలాదేవి, సంధ్యారాణి, యోగా గురువు సురేష్, జయంతి తదితరులు అభినందించారు.

వైభవంగా స్వాతి నక్షత్ర పూజలు

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీ నృసింహ స్వామి వారి ఆలయంలో బుదవారం ఘనంగా స్వాతి నక్షత్ర హెూమం జరిగింది. ప్రధాన అర్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణమూర్తి ఆధ్వర్యంలో వేకువ జామునే స్వయంభువులను కొలిచిన అర్చకులు, వేదపండితులు బాలాలయంలోని కవచమూర్తులకు అష్టోత్తర శతఘటాభిషేక పూజలు నిర్వహించారు. ఏఈఓ సూర్య భ్రమరాంబ, పర్యవేక్షకులు సునీల్ భక్తులకు యజ్ఞ ప్రసాదం అందజేశారు.

అభివృద్ధి పనుల పరిశీలన

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు పరిధి వడ్లపూడి నిర్వాసిత కాలనీ వడ్లపూడి పెట్రోల్ బంక్ వెనుక నూతనంగా వేస్తున్న సీసీ రోడ్డు పనులను బుధవారం స్థానిక కార్పొరేటర్ బోండా జగన్నాధం (జగన్) పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ నాణ్యత తప్పనిసరిగా పాటించాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో విజయ రామరాజు, డీవీ అప్పారావు, దానయ్య, క్రిష్ణ, ఏటీయన్ మూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

విశాలాంధ్ర - పరవాడ: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు అన్నారు. పరవాడలో ఏఎన్ఎం, ఆశాలతో కలిసి ఆయన పర్యటించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. పరిసరాల్లో నీరు నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. నిత్యం వాడే డ్రమ్ములు, నీటి తొట్టెలను వారానికి రెండు సార్లు శుభ్రం చేసి ఆరబెట్టిన తరువాత నీటిని నింపుకోవాలన్నారు. ఈ సందర్భంగా సిబ్బంది ఇంటింటికీ వెళ్లి నీటి తొట్టెలలో నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అచ్చుతరావు, వార్డు మెంబర్ సిరిపురపు రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

విశాలాంధ్ర - అరకులోయ: ఉపాధ్యాయులు విధి నిర్వహణలో సమయపాలన తప్పకుండా పాటించాలని లోతేరు గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శెట్టి నారాయణ సూచించారు. బుధవారం లోతేరు స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో గల ఉపాధ్యాయులకు జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలకు సంబంధించిన యుడైస్, జగనన్న విద్యా కానుక కిట్లు, మధ్యాహ్న భోజన పథకం నమోదును ఆన్లైన్లో సకాలంలో చేయాలన్నారు. తరగతి బోధనలో భాగంగా ముందుగా లెసన్ ప్లాన్, టీఎంఎల్‌ను తప్పకుండా తయారు చేసుకుని విద్యార్థులకు బోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - వి.మాడుగుల: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాడుగుల తహశీల్దార్ పివి.రత్నం అన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని బుధవారం మాడుగుల మండలం గాదిరాయి జేడీపేట గ్రామాల్లో నిర్వహించారు. దీనిలో భాగంగా రెండు గ్రామాలకు కలిసి 1500 సురక్ష పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తాళపురెడ్డి వెంకట రాజారాం, గాదిరాయి, జేడీపేట సర్పంచ్‌లు పి.జగన్నాథరావు, కృష్ణమూర్తి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

హౌసింగ్ స్కీమ్ నిర్లక్ష్యం చేసిన వైసీపీ సర్కార్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: వైసీపీ ప్రభుత్వం హౌసింగ్ స్కీమ్‌ను నిర్లక్ష్యం చేసిందని విశాఖ జిల్లా టీడీపీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ఆరోపించారు. బుధవారం ఆయన పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. "సీఎం జగన్‌కు అవగాహన లేకపోవడం వల్ల పేదవారు సొంతింటి కళ నెరవేర్చలేక పోయారని, రాష్ట్రంలో టీడీపీ హయాంలో సుమారు 12 లక్షల 56 వేలు ఇల్లు మంజూరు చేశామని, సీఎం జగన్ ఉత్తరాంధ్రాను నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. నగరానికి 25 నుంచి 30 కిలోమీటర్ల దూరంలో ఇల్లు కేటాయిస్తున్నారని, వైసీపీ ప్రభుత్వం ఉత్తరాంధ్రలో ఉన్న పేదలను మోసం చేస్తుందని, టిడ్కో ఇల్లు లబ్ధిదారులకు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని, టీడీపీ హయాంలో టిడ్కో ఇల్లు నిర్మాణం చేస్తే వాటికి రంగులు వేసి మేమే నిర్మాణం చేశామని వైసీపీ ప్రభుత్వం చెప్పుకుంటుందన్నారు. ఈ సమావేశంలో దక్షిణ నియోజకవర్గం ఇన్చార్జి గండి బాబ్జి పాల్గొన్నారు.

మణిపూర్ మారణకాండ దుర్మార్గం

విశాలాంధ్ర - గాజువాక: మణిపూర్ హింసాకాండపై పూర్తిగా న్యాయ విచారణను జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని ఇండియన్ లాయర్స్ అసోసియేషన్, గాజువాక బార్ అసోసియేషన్ సంయుక్తంగా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మణిపూర్ ఘటనను నిరసిస్తూ ఇండియన్ లాయర్స్ అసోసియేషన్, గాజువాక బార్ అసోసియేషన్ సంయుక్తంగా గాజువాక కోర్ట్ కాంప్లెక్స్ ముందు బుధవారం న్యాయవాదులు ధర్నా నిర్వహించారు. అఖిల భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్) జిల్లా అధ్యక్షుడు ఏ.వి.లెనిన్ మాట్లాడుతూ మణిపూర్ లో జరిగిన మారణ హెూమం, మహిళలపై అత్యాచారాలు, ఆస్తులపై దాడులను యావత్ ప్రజానీకం తీవ్రంగా ఖండించాలన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై పూర్తి విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకొని మణిపూర్ ప్రజల్లో శాంతి కొనసాగేలా చర్యలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో జీబీఏ అధ్యక్షులు కేవీ స్వామి, సీనియర్ న్యాయవాది వెన్నెల ఈశ్వరరావు, గాజువాక బార్ అసోసియేషన్ కార్యదర్శి వీఎం కృష్ణ, న్యాయవాదులు పట్టాభి రామారావు, ఎస్.రమణ బాబు, సోమేశ్వరరావు, కె.ఎస్.ఎన్.మూర్తి, పురుషోత్తం, జి.రామకృష్ణ, మహిళా న్యాయవాదులు యశోధర వేదమని, ఆదిలక్ష్మి, కె.రాజ్యలక్ష్మి, ఏ.సీతా మహాలక్ష్మి, కే.శ్రీనివాస్, వేణు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయమే మేలు: ఎమ్మెల్యే ముత్తంశెట్టి

విశాలాంధ్ర - ఆనందపురం: ప్రకృతి వ్యవసాయంతో మేలు చేకూరుతుందని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలో తర్లువాడ గ్రామ పంచాయతీ పరిధిలో ఏపీ సీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. వ్యవసాయం రంగంలో వైసీపీ ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిందన్నారు. పొలం బడి ద్వారా భూసార పరీక్ష చేసి మట్టి ఏ పంటకు అనుగుణంగా ఉందో ఆ పంట వేసి పండించేలా రైతులకు వివరిస్తు న్నట్లు తెలిపారు. అనంతరం రైతులకు విత్తనాలు సామాగ్రి అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సంక్షేమ మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కే.కనకారావు, రాష్ట్ర రెల్లి ఇతర కులాల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ వడ్డాది మధుసూదనరావు, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ ఆఫీసర్ కె.రామారావు, డీపీఎం ఎ.మోహన్‌రావు, ఎంపీడీవో అడవ లవరాజు, తహశీల్దార్ లోకవరపు రామారావు, సర్పంచ్ బిఆర్‌బి నాయుడు, ఎంపీపీ శారదా ప్రియాంక, మండల పార్టీ ప్రెసిడెంట్ బంక సత్యం, జెడ్పీటీసీ కోరాడ వెంకటరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకట్రావు, ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ పాల్గొన్నారు.

అసంపూర్తి భవనాలను పూర్తి చేయాలి: మంత్రి అమర్నాథ్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న సచివాలయాలు, వెల్నెస్ సెంటర్లు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ ప్రజాప్రతినిధులకు సూచించారు. బుధవారం అనకాపల్లి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి అమర్నాథ్ మాట్లాడుతూ ఆయా భవన నిర్మాణాలు ఆగస్టు 15వ తేదీ నాటికి పూర్తి కావాలని, ఆయా భవనాలపై ఆరోజు జాతీయ పతాకం ఎగరవేయాలని కోరారు. భవన నిర్మాణాలకు ఎటువంటి ఇబ్బంది వచ్చినా, దానిని తన దృష్టికి తీసుకురావాలని మంత్రి అమర్నాథ్ చెప్పారు. ఆయా భవనాలకు సంబంధించిన పెండింగ్ బిల్స్ ఇప్పటికే చెల్లించామని మంత్రి చెప్పారు.

మొక్కల పంపిణీలో అవినీతిపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - కె.కోటపాడు: జగనన్న మహిళా క్రాంతి పదం ద్వారా డ్వాక్రా మహిళలకు సరఫరా చేసిన పండ్ల జాతి మొక్కలపై భారీ అవినీతి జరిగిందని మండల సర్వసభ్య సమావేశంలో పలువురు సభ్యులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఎంపీడీవో సమావేశ మందిరంలో ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ అధ్యక్షతన అన్ని శాఖల అధికారులతో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వెలుగు ఏపీఎం శ్రీలక్ష్మి మాట్లాడుతూ మండలంలోని ఐదుగురు వెలుగు సీసీల ద్వారా మామిడి, జీడి, సీతాఫలం, నిమ్మ, సపోటా, జామ, కొబ్బరి తదితర మొక్కలను పంపిణీ చేశామని అన్నారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు రొంగలి సూర్యనారాయణ, చౌడువాడ ఎంపీటీసీ రాజేష్ మాట్లాడుతూ కొబ్బరి మొక్క 69 రూపాయలకు ఇవ్వాల్సి ఉండగా 120 రూపాయలు వసూలు చేశారని అన్నారు. మామిడి సపోటా తదితర మొక్కలపై కూడా రెట్టింపు సొమ్ము వసూలు చేయడం జరిగిందని ఇదేమని అడిగితే వెలుగు సీసీలు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని ఆరోపించారు. కేవలం మొక్కల పంపిణీలోనే లక్షలాది రూపాయలు చేతులు మారాయని వారు ఆరోపించారు. హౌసింగ్ ఏఈ రవికుమార్ మాట్లాడుతూ మండలంలో 1500 గృహాలు నిర్మించాల్సి ఉండగా ఇప్పటివరకు 490 ఇల్లు పూర్తయ్యాయని అన్నారు. సకాలంలో హౌసింగ్ పేమెంట్లు ఇవ్వకపోవడంతో పేదలు ఇల్లు నిర్మించలేకపోతున్నారని సభ్యులు ఆరోపించారు. నిబంధనల మేరకు పేమెంట్లు ఇవ్వడం జరుగుతుందని ఏఈ సమాధానం చెప్పారు. ఇందుకు సంతృప్తి చెందని ఎంపీపీ, ఇతర సభ్యులు సక్రమంగా పనిచేయని ఏఈ రవికుమార్‌ను సరెండర్ చేయటానికి మండల సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. చౌడువాడలో విద్యుత్ ట్రిప్ అవుతుందని దీన్ని సరి చేయడానికి విద్యుత్ సిబ్బంది అందుబాటులో ఉండాలని సర్పంచ్ దాడి ఎరుకు నాయుడు అన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో కే శచిదేవి, తహశీల్దార్ రమేష్ బాబు, ఈవోపీఆర్డీ ప్రసాద్, వ్యవసాయ అధికారి సోమశేఖర్, మండల ఇంజనీర్ బాలాజీ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు, ఇళ్ల స్కీమ్ మంజూరులో డబ్బుల వసూలు

రాజవరం సర్పంచ్ భర్త గోసల రమణ

విశాలాంధ్ర - పాయకరావుపేట: ప్రభుత్వం పేదలకు ఇచ్చే ఇళ్ల స్థలాలు, హౌసింగ్ స్కీమ్ మంజూరు చేయడానికి గ్రామంలో కొందరు డబ్బులు వసూలు చేస్తున్నారంటూ మండలంలోని రాజవరం గ్రామ సర్పంచ్ భర్త గోసల రమణ ఆరోపించారు. గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గోసల రమణ మాట్లాడుతూ గ్రామంలో ప్రభుత్వ స్థలాలు లేని కారణంగా రాజవరం గ్రామానికి చెందిన పేదలకు వెంకటనగరంలో ఇళ్ల స్థలాలు మంజూరు చేశారని తెలిపారు. ఇళ్ల స్థలాలు మంజూరైన పేదల నుండి గ్రామానికి చెందిన కొందరు రూ.20 వేలు చొప్పున వసూలు చేశారని తెలిపారు. అలాగే జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు మంజూరైన వారికి హౌసింగ్ స్కీమ్ మంజూరుకు మరో రూ.20వేలు వసూలు చేస్తున్నారని తెలిపారు. అంతేగాక జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు మంజూరైన వారు స్థలాలు అమ్ముకుంటున్నారని వారి నుండి కూడా డబ్బులు వసూలు చేస్తున్నారని జగనన్న సురక్షలో గోసల రమణ ఆరోపించారు. అధికారులు, ఎమ్మెల్యే, ప్రభుత్వం చర్యలు తీసుకొని పేదల నుండి చేస్తున్న వసూలును అరికట్టాలని కోరారు. గజపతినగరం, కేశవరం గ్రామాల్లో తాగునీటి సమస్యలు పరిష్కరించాలని పలువురు కోరారు. అనంతరం రాజవరం, కేశవరం పంచాయతీల్లో దరఖాస్తు చేసుకున్న వారికి కుల, ఆదాయ ధృవపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు గోసల అమ్మాజీ, మేడిశెట్టి రామ గోవిందు, ఎంపీటీసీ గోసల మరిణమ్మ, గోసల దేముడు, యజ్జల సత్యనారాయణ, కాకాడ కృష్ణ, గోసల నూకరాజు, వంకా రమణ, కోనాడ కాశీరావు, దివాణం, ఎంపిడీఓ సాంబ శివరావు, డిప్యూటి తహశీల్దార్ కె.నూకరాజు, ఇన్‌ఛార్జి ఈఓపీఆర్‌డి వై.సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు బిఎబిఎల్ మూర్తి, మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

కొండెక్కిన టమాట ధరలు

విశాలాంధ్ర - భీమిలి: వంటింట్లో నిత్యం వాడే కూరగాయలలో టమాట ఒకటి. ఈమధ్య టమాటా ధరలు అయితే సామాన్యుడికి అందని ద్రాక్షలా మారిపోయిన సంగతి మనకు తెలిసిందే. వినియోగదారులు టమాటా ధరలు చూసి గగ్గోలు పెడుతున్నారు. కిలో టమాట ధర ఈరోజు బహిరంగ మార్కెట్లో సుమారు 130 నుంచి 150 రూపాయలు వరకు ధర పలుకుతుంది. టమాటాలు రేటు అమాంతంగా పెరిగిపోవడం వల్ల వినియోగ దారులు అయో మయంలో పడ్డారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం టమాటాలు ధరలు తగ్గించే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఓటర్ల సర్వేను జేసీ తనిఖీ

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: విశాఖ పట్టణంలో 220, 221, 223, 248 పోలింగ్ కేంద్రాల పరిధిలో శ్రీనగర్, బాలాజీ నగర్, నెహ్రూ బజార్, చైతన్య నగర్‌లలో జరుగుతున్న ఓటర్ల జాబితా సర్వేను జాయింట్ కలెక్టర్ కెయస్ విశ్వనాథన్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా జూలై 21 నుండి ఆగస్ట్ 21 వరకు భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాపై ప్రభుత్వం నుంచి ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని బూత్ లెవల్ అధికారుల ద్వారా చేపట్టినట్లు తెలిపారు. బూత్ లెవల్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ హుస్సేన్ సాహెబ్, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, బీఎల్వోలు పాల్గొన్నారు.

జిల్లాలో 1433 ధృవపత్రాలు పంపిణీ

విశాలాంధ్ర బ్యూరో- పాడేరు: అల్లూరి సీతా రామరాజు జిల్లాలో బుధవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 1,433 ధృవపత్రాలు పంపిణీ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 3 మండలాల పరిధిలోని 04 సచివాలయాల్లో జగనన్న సురక్ష ప్రత్యేక శిబిరాలు నిర్వహించామన్నారు. 3,514 గృహాల నుంచి వాలంటీర్ల యాప్‌లో వివిధ సర్టిఫికెట్ల కోసం 3,449 వినతులు రాగా, 2,937 టోకెన్లు నమోదు చేయడం జరిగిందన్నారు. 2,640 దరఖాస్తులను ఆన్‌లైన్ చేయడం జరిగిందని, అందులో 1,433 సర్టిఫికెట్లు పంపిణీ చేశామని తెలిపారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

విశాలాంధ్ర - అనంతగిరి: మండల కేంద్రంలో మండల విద్యాశాఖ అధికారి కిలో బాలాజీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు రెండు రోజులు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల విద్యా శాఖ అధికారి బాలాజీ పాల్గొని ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా విధి నిర్వహణలో భాగంగా నిర్వహించవలసిన రికార్డులు, లెసన్ ప్లాన్, టీచర్ డైరీ వంటివి ఏ విధంగా రాయాలో వివరించారు.

వాతాడలో గడప-గడపకి మన ప్రభుత్వం

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలోని వాకపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని వాతాడ గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. బుధవారం ఉదయం పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబురావు ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామచంద్రమూర్తి, సర్పంచ్ మైలపల్లి శ్రీనివాసరావు, జిల్లా మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు మాతా గురునాథరావు, వైసిపి నాయకులు, చోడిపల్లి కోదండరావు, మైలపల్లి రాజారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలో గత 20 రోజులుగా జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఆఖరి రోజు కావడంతో గుడివాడ, గెడ్డపాలెం గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో ఎమ్మెల్యే హాజరై లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ విజయకుమార్, ఎంపీడీఓ రామచంద్రమూర్తి, ఈవోపీఆర్డీ సత్యనారాయణ, డిప్యూటీ తహశీల్దార్ శ్యామ్ పాల్గొన్నారు.

జగనన్న పాలన ఓ నూతన అధ్యాయానికి శ్రీకారం



విశాలాంధ్ర - పద్మనాభం: జగనన్న పాలన ఓ నూతన అధ్యాయానికి శ్రీకారం అని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలం అయినాడ, నేరళ్ళవలస పంచాయతీలలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. జగనన్న సురక్ష అనే కార్యక్ర మంతో 12 రకాల సర్టిఫికెట్లు అందజేస్తున్నట్టు తెలిపారు. సీఎం జగన్ చేస్తున్న అభివృద్ధిని గమనించి రాబోయే ఎన్నికల్లో ఆయన్నే ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. నేరెళ్ల వలస పంచా యతీలో 210, అయినాడలో 149 మంది లబ్ధిదా రులకు పలు రకాల సర్టిఫికేట్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, పద్మనాభం మండల వైసిపి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

కోలా గురువులకు అభినందన

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: వైసీపీ విశాఖ జిల్లా నూతన అధ్యక్షుడిగా నియమితులైన కోలా గురువులుని 87వ వార్డు వైసీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో కోమటి రమాదేవి, ఈశ్వరరావు, రాజు, అంజి, సుమంత్‌లు ఉన్నారు.

విశాలాంధ్ర
→ విశాఖపట్నం
→ అనకాపల్లి
→ అల్లూరి సీతారామరాజు

కొండపోతగా కురుస్తున్న వర్షాలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నగరం లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. బుధవారం మధ్యాహ్నం నుంచి ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభించిపోయింది. కొండవాలు ప్రాంతాల్లో జీవిస్తున్న ప్రజలు బిక్కుబిక్కుమంటూ భయాందోళన చెందుతున్నారు. నగరంలోని వన్ టౌన్, పూర్ణ మార్కెట్, చావులమథం, స్టేడియం రోడ్డు, రైల్వే న్యూ కాలనీ, జ్ఞానపురం, పీలా నగర్ ప్రాంతాలు జలమయం అయ్యాయి. చావుల మధం బ్రిడ్జి వద్ద వర్షం నీళ్ళు నిలిచిపోవడంతో వాహనా రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్టేడియం రోడ్డు, పూర్ణ మార్కెట్ ప్రాంతాలలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు పొంగి మేన్ హోల్ నుంచి నీరు బయటికి పొంగి ప్రవహించింది. జ్ఞానపురం లోని మైన్ రోడ్డు,గెడ్డ వీధి నుంచి స్మశానం వరకు వీధులకు గెడ్డ నీళ్ళు వర్షం నీరు మోకాలి లోతులో నిలిచిపోవడం వలన ప్రజలు విద్యార్థులు చిన్న పిల్లలు చాలా ఇబ్బందులు పడ్డారు. జ్ఞానపురం శ్మశానం వద్ద వున్న కానాలలో చెత్త నిత్యం పేరుకుపోయి వుంటుందని ఇక్కడ ఎప్పుడు కానాల బయట వున్న చెత్తను మాత్రమే క్రేన్‌తో తొలగిస్తూ వుంటారని కానాల లోపల వున్న చెత్తను మాత్రం తొలగించడం లేదని దాని వలన ఎప్పుడు ఎంత చిన్న వర్షం కురిసిన గెడ్డ పొంగిపోయి చెత్త నీళ్లతో జ్ఞానపురం వీధులు జలమయం అవుతున్నాయని జ్ఞానపురం ప్రాంత ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ప్రభుత్వ అధికారులు ప్రజా ప్రతినిధులు, పోర్ట్ అధికారులు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకుంటారని తాము ఆశిస్తున్నామని చెబుతున్నారు. నగర్ శివారు ప్రాంతాలైన మధురవాడ, గాజువాక, పెందుర్తిలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది.

సాహితీ ఫార్మా మృతుల కుటుంబాలకు చెక్కులు

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: జిల్లాలో ఎస్ఈజెడ్ సాహితీ ఫార్మాలో ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతి చెందిన ఆరుగురు కుటుంబాలకు బుధవారం పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ చెక్కులను అందజేశారు. కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో బాధిత కుటుంబాలు ఒక్కొక్కరికి రూ 25 లక్షల చొప్పున మొత్తం రూ.కోటి 50 లక్షలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రవి పట్నాన్ శెట్టి, ఎలమంచిలి ఎమ్మెల్యే యు.వి.రమణ మూర్తి రాజు (కన్నబాబు) అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ, ఎంపీపీ జి.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి మావోయిస్టు అమరవీరుల వారోత్సవాలు

విశాలాంధ్ర -సీలేరు: మావోయిస్టు అమరవీరుల వారోత్సవాలను ఈ నెల 28 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు నిర్వహించాలని మావోయిస్టు ఏఓబీ ఎస్‌జెడ్‌సి కార్యదర్శి గణేష్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. గత ఏడాది దేశవ్యాప్తం సుమారు 91 మంది మావోయిస్టులు మృతి చెందారని తెలిపారు. మీరందరూ మావోయిస్టు ఉద్యమం బలోపేతానికి కృషి చేసినట్లు తెలిపారు. ఇందులో కేంద్ర కమిటీ సభ్యులు కటకం సుదర్శన్ అలియాస్ ఆనంద్ గుండెపోటుతో మరణించడం పార్టీకి తీరని లోటన్నారు.

బొలిశెట్టికి జనసైనికుల శుభాకాంక్షలు

విశాలాంధ్ర - వి.మాడుగుల: జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ పుట్టినరోజు సందర్భంగా మాడుగుల మండలంలో జనసైనికులు బుధవారం సత్యనారాయణను కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాడుగుల మండల జనసైనికులు పాల్గొన్నారు.

వర్షాలకు కూలిన పెంకుటిల్లు

విశాలాంధ్ర - మారేడుమిల్లి: మండలంలో గత పది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. కొండ కాలువలు వాగులు వంకలు వరద నీరు చేరి ఉద్రిక్తంగా ప్రవహిస్తున్నాయి. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి స్థానిక సిఐసీఆర్ చర్చి సమీపంలో ఉన్న మడి భీమన్న దొర పెంకుటిల్లు కూలిపోయింది. అదే సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఇల్లు కూలిపోవడంతో ఇంట్లో సామాన్లు దెబ్బతిన్నాయని అధికారులు స్పందించి తమకు తగు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

రాకపోకలు బంద్

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: భారీగా కురుస్తున్న వర్షాల కారణంగా వాగులు వంకలు పొంగి ప్రవహిస్తుండటంతో శబరి గోదావరి పొంగి ప్రవహిస్తుండంతో వాగుల్లో వరద నీరు చేరి చింతరు వద్ద సోకలేరు వాగు, వడ్డిగూడెం, కన్నాయి గూడెం వద్ద, అలాగే శ్రీ రామ గిరి దగ్గర వరద నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. భద్రాచలం వద్ద 44 అడుగుల వరకు గోదావరి వరద నీరు చేరింది. లోతట్టు ప్రాంతాలైన వడ్డిగూడెం వడ్డిగూడెం కాలనీ తదితర గ్రామాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తమ తమ ఇండ్లలోని సామానులను వాహనాలపై తీసుకొని ఎత్తైన ప్రదేశానికి చేరుతున్నారు.

కూలిన ప్రహరీ

విశాలాంధ్ర - దేవరాపల్లి: మండలంలోని తెనుగుపూడి సచివాలయం ప్రహరీ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి బుధవారం కుప్పకూలింది. ఈ సచివాలయం ఈ నెల్లో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా ఈ నెల 9న ఈ సచివాలయం ప్రారంభోత్సవం చేసిన సంగతి తెలిసిందే. శారదా నది తీర ప్రాంతానికి ఈ ప్రహరీ గోడ అనుకుని ఉండడం వల్లనే ఈ ప్రహరీ కుప్పకూలిందని పలువురు చర్చించుకుంటున్నారు.

పిడుగుపాటుకు గిరిజనుడు మృతి

విశాలాంధ్ర - అరకులోయ: అరకులోయ మండల పరిధిలో గల మాదల పంచాయతీ బోరిగుడ గ్రామంలో బుధవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షంతో పాటు పిడుగు పడడంతో గుబాయ్ రాజు (50) అనే గిరిజనుడుతో పాటు నాలుగు ఆవులు మృతి చెందాయి. వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్న దుబాయ్ రాజు చనిపోవడంతో కుటుంబ సభ్యులు లబోదిబోమంటున్నారు. పిడుగుపాటుకు వంతల పోత్రియ, సోమెలి పండుకు చెందిన ఒక్క పశువు 15000 చొప్పున నాలుగు పశువులకు నష్టపరిహారం చెల్లించాలని మరణించిన గుబాయ్ రాజు కుటుంబానికి 10 లక్షల నష్టపరిహారం ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని ఆదివాసి గిరిజన సంఘం డిమాండ్ చేసింది.

ఇరిగేషన్ సబ్ డివిజనల్ కార్యాలయం ఏర్పాటు

విశాలాంధ్ర - పాయకరావుపేట: పాయకరావుపేటలో ఇప్పటి వరకు ఉన్న ఇరిగేషన్ సెక్షన్ కార్యాలయం నేటి నుండి సబ్ డివిజన్ కార్యాలయం గా ఏర్పాటు చేశారు. ఇరిగేషన్ సెక్షన్ కార్యాలయం ఇప్పటి వరకు యలమంచిలి సబ్ డివిజన్ పరిధిలో ఉండేది. నియోజకవర్గానికి ఒక సబ్ డివిజన్ కార్యాలయం ఏర్పాటులో భాగంగా నియోజకవర్గ కేంద్రమైన పాయకరావుపేటలో సబ్ డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేశారు. సబ్ డివిజన్ కార్యాలయ భవనం లేనందున ప్రస్తుతం కార్యకలాపాలు సెక్షన్ కార్యాలయంలో కొనసాగిస్తారు. సబ్ డివిజన్ కార్యాలయంలో డిఈఈగా ఎస్.జగదీశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. పాయకరావుపేట ఏఈగా జి.శ్రీరామమూర్తి, నక్కపల్లి, కోటవురట్ల మండలాల ఏఈగా జి.శ్యామ్ గౌడ్, ఎస్.రాయవరం ఏఈగా అమీనా అక్తర్ భాను విధులు నిర్వహిస్తారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

విశాలాంధ్ర - పెందుర్తి: పెందుర్తి శాఖ గ్రంథాలయానికి సుజాతనగర్‌కి చెందిన రచయిత ఆళ్ల అప్పారావు తెలుగు ఆంగ్ల భాషలకు సంబంధించి ఇదివరకే ఉపయోగించిన 50 పుస్తకాలను గ్రంథాలయ అధికారి బి.సూర్య కళకు అందజేశారు. మహా ప్రస్థానం బొబ్బిలి కొండ కొండ పొలం గిడుగు రామ్మూర్తి పంతులు అక్షర బోధిం సప్త భూమి శతాబ్ది సూర్యుడు మా అమ్మాయి అంతర్ముఖి వంటి నవలలు మత గ్రంథాలు సాహిత్యపరమైన మొత్తం యాభై పుస్తకాలు గ్రంథాలయానికి బహుమానంగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రచయిత పుస్తకధాత ఆళ్ల అప్పారావు, పాఠకులు గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర - అనంతగిరి: అనంతగిరి మండలం నడిమివలస మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. అనంతగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రాజా ప్రతాప్ రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. కార్యక్రమంలో ఎం పి హెచ్ ఈ ఓ నర్సింగరావు, ఐసిడిఎస్ సూపర్ వైజర్ సత్యవతి, ఎం ఎల్ హెచ్ పి.రజని, ఎం పి హెచ్ ఎ ఎస్ సింహాచలం, నడిమివలస పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరాజి మల్లేశ్వర రావు పాల్గొన్నారు.

బీఎల్ఓల ఇంటింటి సర్వే

విశాలాంధ్ర-దేవరాపల్లి: ఎన్నికల కమిషన్ ఆదేశాలు మేరకు ప్రతి గ్రామంలో సమగ్ర ఇంటింటి సర్వే కార్యక్రమం మండలంలోని ఎంతో ప్రతిష్టాత్మకంగా కొనసాగుతుంది. మండలంలోని ఎం.అలమండ గ్రామంలో పోలింగ్ బూత్ నెంబర్ 167 లో జరుగుతున్న బివోఎల్‌ఓలు ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని తహశీల్దార్ ఎమ్. లక్ష్మీ బుధవారం స్వయంగా వెళ్లి పరిశీలించారు.

నిబంధనలు పాటించాలి

విశాలాంధ్ర - హుకుంపేట: హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా ప్రయాణాలు సాగిస్తే రోడ్డు మీద కనిపిస్తే చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్ఐ సతీష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అరకు- పాడేరు ప్రధాన రహదారి గొల్లిగెడ్డ వంతెన వద్ద ఎస్ఐ తమసిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. వాహనాల రికార్డులను పరిశీలించారు. ఇప్పటి వరకు తనిఖీలు చేసిన కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డివైడర్‌ను తొలగించాలి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: సిరిపురం నుండి వీఐపీ రోడ్డుకు వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన డివైడర్ ను తక్షణమే తొలగించాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు రవీంద్ర మేడపాటి డిమాండ్ చేశారు. బుధవారం సిరిపురం నుండి విఐపి రోడ్డుకు, విఐపి రోడ్డు నుండి సంపత్ వినాయగర్ టెంపుల్ కి వెళ్లే మార్గాలలో ఏర్పాటు చేసిన డివైడర్ ను వెంటనే తొలగించాలని బీజేపీ విశాఖపట్నం పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు రవీంద్ర మేడపాటి ఆధ్వర్యంలో సిరిపురం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. టైకూన్ హోటల్ దగ్గరలో ఏర్పాటు చేసిన డివైడర్ ఎవరికోసం ఏర్పాటు చేశారని బిజెపి విశాఖపట్నం పార్లమెంటు జిల్లా అధ్యక్షులు రవీంద్ర మేడపాటి ప్రశ్నించారు. డివైడర్లను ఏర్పాటు చేసేటప్పుడు శాస్త్రీయంగా పరిశీలించి ఏర్పాటు చేయాలి కానీ, ఇష్టం మాత్రం అందుకు భిన్నంగా అధికార పార్టీకి చెందిన నాయకులకు లబ్ధి చేకూర్చే విధంగా ఉందన్నారు. గతంలో ఉన్న ట్రాఫిక్ లైట్స్ సిగ్నల్ సిస్టం ను సింక్రనైజ్ చేయమని అనేక పర్యాయాలు అధికారులను కోరినా స్పందించలేదని, తక్షణమే ట్రాఫిక్ సిగ్నల్స్ సిస్టం ను సింక్రనైజ్ చేయమని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు కేతినేని సురేంద్ర మోహన్ , జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరంగం ధనేశ్వర రావు, బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ఉమ్మిడి సుజాత రాజ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు కర్రి అశోక్ కుమార్, బీజేపీ తూర్పు నియోజకవర్గం కన్వీనర్ మురళి మోహన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేదమే నా ఊపిరి నా ఆయుధం

విశాలాంధ్ర - చింతూరు: ఆయుర్వేదమే నా ఊపిరి నా ఆయుధమని డాక్టర్ జమాల్ ఖాన్ అన్నారు. చింతూరు డివిజన్ కేంద్రంలోని నిమ్మలగూడెం అఫ్రీన్ ఆయుర్వేద దవాఖానాలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తన తండ్రి యండి ఇస్మాయిల్ ఖాన్ చిన్నతనంలో తనకు నేర్పిన వనమూలికా వైద్యమే నేడు తాను ఈ స్థితిలో ఉండటానికి కారణమని అన్నారు. నిరుపేదలకు ఫీజులు లేకుండా ఉచితంగా భోజనం పెడుతూ దీర్ఘకాలిక రోగాలను నయం చేస్తూ వారి ప్రేమానురాగాలను పొందుతున్నానన్నారు. తన సేవలను గుర్తించి ఈనెల 22, 23 తేదీల్లో ఢిల్లీలో అవార్డును కూడా అందుకున్నట్లు తెలిపారు. ఆయుర్వేద వైద్యులు డాక్టర్ జమాల్ ఖాన్‌కు బుధవారం ఆయన నివాసంలో చింతూరు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మంతెన సత్యనారాయణ, సీనియర్ పాత్రికేయులు భాస్కరాచారి, చదలవాడ విజయ్ కుమార్ శాలువాను కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాత్రికేయులు షాజహాన్ మాట్లాడుతూ జమాల్ ఖాన్ మరెన్నో సేవా పురస్కారాలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు షౌకత్ అలీ, ఎస్ కే జానీ, భాస్కరాచారి, నరేష్, శ్రీనివాసరావు, ఈశ్వర చారి, సతీష్, సాగర్, లక్ష్మణ్, జీవన్, రియాజ్, శ్రీను, దేవుడు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశానికి అధికారుల హాజరు తప్పనిసరి

విశాలాంధ్ర - పెదబయలు: సర్వసభ్య సమావేశానికి మండలంలో ఉన్న ప్రతి డిపార్ట్మెంట్ అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని స్థానిక ఎంపీపీ బోండా వరహాలమ్మ అన్నారు. మూడు నెలలకు ఒకసారి జరిగే సర్వ సభ్య సమావేశానికి పూర్తి స్థాయిలో అధికారులు హాజరు కాకపోవడం వలన ఆమె మండిపడ్డారు. ముందుగా స్థానిక విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ మండలంలో 36 స్కూళ్లకు నాడు నేడు నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. ఈ విషయంపై స్థానిక ఎంపీటీసీ కిమూడరి బొంజు బాబు మాట్లాడుతూ విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారయిందని దానికి నిదర్శనం పదవ తరగతి ఫలితాలేనని అన్నారు. ఇప్పటికైనా ఉపాధ్యాయుల సమయపాలన పాటించి గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక జడ్పీటిసి కూడా బొంజుబాబు, వైస్ ఎంపీపీ కొర్ర రాజుబాబు, స్థానిక సర్పంచ్ వలాని మాధవరావు, తహసిల్దార్ కృష్ణారావు, ఎంపీడీవో ఎల్.పూర్ణయ్య, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు కాంతారి సురేష్ కుమార్, మత్స్యరాజు, రవి శంకర్ పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆమడ దూరంలో పీవీటీజీ గ్రామం

విశాలాంధ్ర - చింతపల్లి: పీవీటీజీల సంక్షేమానికి, వారి గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని నాయకులు, అధికారులు గొప్పగా ప్రకటనలు గుప్పిస్తున్నప్పటికీ ప్రజల సంక్షేమం అధ్వానంగానే తయారైంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్ళు గడుస్తున్నా చింతపల్లి మండలం లోతుగెడ్డ పంచాయితీలోని పివిటిజి గ్రామమైన బొడ్డుమామిడిలో ఇప్పటి వరకు ఒక్క మౌలిక సదుపాయం సమకూరలేదంటే ఆశ్చర్యానికి గురికాక తప్పదు. గ్రామానికి చెందిన వంతల ప్రసాద్ అందించిన వివరాల ప్రకారం గ్రామంలో సుమారు 25 కుటుంబాలలో 120 వరకు జనాభా కలిగి, 20 మంది బడి ఈడు పిల్లలు, 30 మంది అంగన్ వాడి పిల్లలు, గర్భవతులు, బాలింతలు ఉన్నారని,. కానీ గ్రామంలో పాఠశాల గాని, మినీ అంగన్ వాడి సెంటర్ గాని లేదన్నారు. పాఠశాలకు, మినీ అంగన్ వాడి సెంటర్ కు వెళ్లాలంటే సుమారు రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న కొత్తపాకలు గ్రామానికి వెళ్లాలని, ప్రభుత్వాలు మారినా, పాలకులు మారారు కానీ గ్రామంలో పరిస్థితులు మారలేదని అన్నారు. ఇప్పటి వరకు ఒక్కరికి కూడా హౌసింగ్ మంజూరు కాలేదని. కనీసం తమ గ్రామంలో మీటరు సిమెంటు రహదారి వేసిన దాఖలాలు లేవని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నత అధికారులు స్పందించి తమ గ్రామంలో మౌలిక సదుపాయాల ఏర్పాటుకు కృషి చేయాలని ఆయన కోరారు.

అధికారుల తీరుపై ఎమ్మెల్యే ముత్తంశెట్టి అసంతృప్తి

విశాలాంధ్ర - పద్మనాభం: మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో అధికారుల తీరుపై స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అసంతృప్తిని వ్యక్తం చేశారు. వనుల్లో పురోగతి అంతంత మాత్రంగా కనిపించడం లేదని ప్రతి చోట ఎక్కడో దగ్గర తాగునీటి సమస్యలు ఉన్నాయని ప్రజాప్రతినిధులు స్థానిక ప్రజాప్రతినిధులు విన్నవించుకున్నప్పటికీ ఆ సమస్యలను పరిష్కరించడం లేదని అన్నారు. ఆర్ అండ్ బి వారు కూడా అవసరమైన చోట రోడ్డు ప్యాచ్ వర్క్స్ ఆశించినంత మేరకు పూర్తి చేయడం లేదని అన్నారు. పనులు వేగవంతం చేయాలని వారిని ఆదేశించారు. కృష్ణాపురం, గంధవరం, రెడ్డిపల్లి తదితర పంచాయతీల్లో మంచినీటి బోర్లు కావాలని విన్నవించుకున్నా అధికారులు అలసత్వం వల్ల ఇప్పటివరకు వేయలేదని స్థానిక ప్రజా ప్రతినిధులు వాపోయారు. మండలంలోని కృష్ణాపురం, పద్మనాభం, బి ఆర్ తాళవలస పంచాయతీల్లో ఈనామ్ భూములు ఉన్నాయని ఈనామ్ జిరాయితీ భూములకు పట్టాలు ఇవ్వాలని స్థానిక తాసిల్దార్ కు ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాంబాబు, జడ్పిటిసి, ఎంపీటీసీలు, సర్పంచులు, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

భార్య ఆత్మహత్య కేసులో భర్తకు ఏడేళ్ల జైలు శిక్ష

విశాలాంధ్ర - హుకుంపేట: వివాహిత ఆత్మహత్య కేసులో భర్త పడమట లక్ష్మణరావుకు ఏడేళ్ల జైలు శిక్షతో పాటు 2వేల జరిమానా విధించి నట్లు స్థానిక ఎస్ఐ సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. దీనిని సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. హుకుంపేట మండల కేంద్రంలో పడమట మాధవి 9/2/2021 సంవత్సరంలో అనకాపల్లి జిల్లా కశింకోట మండలం కన్నూరుపాలెంకు చెందిన పడమట లక్ష్మణరావును వివాహం చేసుకుంది. భర్త, కుటుంబ సభ్యుల వేధింపులు తట్టుకోలేక హుకుంపేట మండల కేంద్రంలో తల్లిదండ్రుల ఇంటికి వచ్చి ఉరిపోసుకుని మృతి చెందింది. దీనిపై మృతిరాలి తండ్రి కొత్త కామరాజు ఫిర్యాదులో కేసు నమోదు చేసిన సీఐ సుధాకర్ కేసు దర్యాప్తు నిర్వహించి ముద్దాయిపై 306, 498-ఏ ఆర్/డబ్ల్యూ 34 ఐపీసీ ప్రకారం చోడవరం కోర్టులో కేస్ ఫైల్ చేశారు. బుధవారం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్ట్ లోని శ్రీ సీనియర్ సివిల్ జడ్జ్ శ్రీమతి ఆకాంక్షకే కేసులో సాక్షులను విచారణ నిర్వహించిన అనంతరం మృతురాలి భర్త లక్ష్మణరావుకు నేరం రుజువైనందున ఏడేళ్ల జైలు శిక్షతోపాటు రెండు వేలు రూపాయలు నగదు జరిమానా విధించారని స్థానిక ఎస్ఐ తెలిపారు.

జాతీయ స్థాయి ఆంతే 2023 పోటీ పరీక్షకు దరఖాస్తులు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: జాతీయ స్థాయిలో స్కాలర్షిప్ సాధించే దిశలో నిర్వహించే ఆకాష్ నేషనల్ టాలెంట్ హంట్ (ఆంతే 2023) పోటీ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్ రాజేష్, బిజినెస్ హెడ్ వింకు ప్రసాద్ తెలిపారు. బుధవారం ద్వారకా నగర్‌లో గల ఆకాష్ మెయిన్ బ్రాంచ్‌లో నిర్వహించిన విలేక రుల సమావేశంలో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా దాదాపు 20 లక్షల మంది ఈ పరీక్షకు ప్రతి ఏటా హాజరవుతారని తెలిపారు. అక్టోబర్ 7-15 మధ్య ఆన్‌లైన్ పరీక్ష ఆఫ్‌లైన్ పరీక్ష అక్టోబర్ 8వ తేదీ, 15వ తేదీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏడవ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదివే విద్యార్థులు ఎవరైనా ఈ పరీక్షకు హాజరయ్యేందుకు అర్హులని తెలిపారు. ఫలితాలు అక్టోబర్ 27, నవంబర్ 3, 8 తేదీలలో మూడు స్థాయిల వారికి ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఈశ్వర్ ప్రసాద్, బ్రాంచ్ మేనేజర్ రాజేష్ తదితరులు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి పోస్టర్లు ఆవిష్కరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర - దేవీపట్నం: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాల య్యాయి. దేవీపట్నం మండలం పరసనిపాడు కాలనీ సమీపంలో ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు అయినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. ముగ్గురు వ్యక్తులకు తీవ్ర గాయాలు కాగా, ఇద్దరు పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. క్షతగాత్రులను ప్రభుత్వ హాస్పిటల్ కి తరలించామన్నారు.

పెరుగుతున్న గోదారి

విశాలాంధ్ర - కూనవరం: ఎడతెరిపిలేని వర్షాల కారణంగా ప్రాజెక్టులు నిండా నీరు చేరడంతో గేట్లను ఎత్తి భారీగా వరద నీరుని దిగువ ప్రాంతాలకు వదులుతున్నారు. దీంతో కూనవరంలో వరద హడావుడి ఎక్కువైపోయింది. ఆ ప్రాంతాల ప్రజలు ఇప్పటికే కోతుల గుట్టలోని పునరావాస కేంద్రానికి తరలి వెళ్తున్నారు. నీరు గంట గంటకు పెరుగుతున్న నేపథ్యంలో అధికారులు ఉదయ భాస్కర్ కాలనీ, గిన్నెల బజారు, చాపల బజారు తదితర కాలనీలను ఖాళీ చేయించారు. వర్షాలు ఆగకుండా కురుస్తుండటం వరద ఉధృతిని కట్టిపడవేయటం అంచనా వేయలేకపోతున్నామని ఇప్పటివరకు అందిన సమాచారం ప్రకారం లోతట్టు ప్రాంతాల ప్రజలంతా సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాల్సిందిగా అధికారులు చెబుతున్నారు.

జగనన్న సురక్ష ద్వారా 11 రకాల సర్టిఫికెట్లు

విశాలాంధ్ర - దీకొరం: 11 రకాల సర్టిఫికెట్లను జగనన్న సురక్ష ద్వారా అందిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండలంలోని నిరిజాం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. అర్హత మేరకు జూలై 1 నుండి 26 వరకు నియోజకవర్గంలో జరిగిన సురక్ష శిబిరాల్లో ఇంటిగ్రేట్ ఆదాయ ధ్రువీకరణ ఫ్యామిలీ నెంబర్ తదితర సర్టిఫికెట్లకు ప్రజలు దరఖాస్తులు సమర్పించగా వారికి అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కూరచా జయమ్మ, సర్పంచ్ సత్యవతి, ఎంపీటీసీ దేవి, ఎంపీడీవో జయప్రకాశరావు, మండల సచివాలయ కన్వీనర్ ఈర్రి చైతన్య, పంచాయతీ కార్యదర్శి పద్మావతి, వీఆర్వో శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతిఒక్కరికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ

విశాలాంధ్ర - దేవీపట్నం: అర్హులైన ప్రతి ఒక్కరికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అందేలా చర్యలు చేపడతామని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి స్పష్టం చేశారు. దేవీపట్నం మండలం కొండ మొదలు కచ్చులూరు, కతనపల్లి గ్రామాల్లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. 18సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు ఆర్ అండ్ ఆర్‌తో పాటు ఇంకా సుమారు 45 మందికి ఇక్కు మంజూరు కాలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కుంజం మురళి, ఎస్ఐఎస్ కన్వీనర్ కందుల బాబ్జి, జెడ్పీటీసీ శీరసం సత్యవేణి పాల్గొన్నారు.

చేతబడి నెపంతో మహిళ హత్య

విశాలాంధ్ర - మారేడుమిల్లి: చేతబడి చేస్తుందనే నెపంతో ఓ గిరిజన మహిళ హత్యకు గురైనట్లు తెలిసింది. మండలంలో జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని చావిడికోట పంచాయతీ పరిధిలోని బంధ గ్రామానికి చెందిన ఓ మహిళ చేతబడి చేస్తుందని అనుమానంతో ఆదే గ్రామంలోని కొంతమంది కుటుంబ సభ్యులు తాడుతో ఆమె గొంతు నులిమి హత్య చేసి మృతదేహాన్ని పూడ్చిపెట్టినట్లు తెలిసింది. మారేడుమిల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలను సేకరిస్తున్నారు. ఈ హత్యకు సంబంధించి ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

దోబూతులాడుతున్న శబరి, గోదావరి నదులు



విశాలాంధ్ర - చింతూరు: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వరద ప్రవాహం పెరగడంతో మండలంలోని పలు గ్రామాలు వరదలో చిక్కుకున్నాయి. చింతూరు నుండి విఆర్ పురం వెళ్లే రహదారిపై చీకటివాగు, సోకలేరు, జలివారిగూడెం వాగు, ఏజి కోడేరు, చిట్టుమామిడి గ్రామాల మధ్య శబరి నది పోటు

గుర్రె రోడ్డు పైకి నీరు చేరింది. దీంతో విఆర్ పురం వైపు చింతూరుకు రాకపోకలు స్తంభించిపోయాయి. అలాగే చట్టి గ్రామం నుండి కొవ్వూరు వెళ్లే మార్గంలో చంద్రవంక వాగు ప్రవహిస్తుండటంతో బ్రిడ్జి మునిగిపోయింది. దీంతో కుమ్మూరు పంచాయతీలోని మూడు గ్రామాలు, కూనవరం మండలంలోని సుమారు నాలుగు గ్రామాలకు చింతూరుకు రాకపోకలు స్తంభించిపోయాయి.

80 కిలోల గంజాయి పట్టివేత

విశాలాంధ్ర - జి.మాడుగుల: మండల కేంద్రంలో గల ఎమ్మార్వో ఆఫీస్ జంక్షన్ వద్ద మంగళవారం రాత్రి వాహన తనిఖీ నిర్వహిస్తుండగా నర్సీపట్నం నుండి వస్తున్న ఫోర్డ్ కార్‌ను ఆపి తనిఖీ చేయగా అందులో 80 కిలోల గంజాయి బయట పడినట్లు, కారులో నలుగురు ఉండగా, అందులో ఇద్దరు పోలీసులను చూసి పరారైనట్లు, మిగతా ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ముద్దాయిని విచారించగా మహారాష్ట్రకు చెందిన మధుసూదన్ కమల్, మహమ్మద్ జమీల్ షేక్‌గా గుర్తించారు.

పోటెత్తుతున్న గోదావరి

విశాలాంధ్ర-ఎటపాక : గత మూడు రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరికి వరద పోటెత్తుతోంది. బుధవారం ఉదయం 8గంటలకు 39 అడుగులు చేరుకున్న గోదావరి క్రమ క్రమంగా పెరుగుతూ మధ్యాహ్నానికి నీటిమట్టం 43.5 అడుగులకు చేరడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. వీరాయి గూడెం, గట్టు గూడెం, పిచ్చుకల పాడు గ్రామాలకు వరద నీరు మట్టు ముట్టడంతో రోడ్డు పైకి నీరు చేరడంతో రాకపోకలు నిలిచాయి.

వైద్యంపై సిబ్బందికి అవగాహన

విశాలాంధ్ర - జి.మాడుగుల: మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కేంద్ర బృందం పర్యటించి తనిఖీ నిర్వహించారు తెలిసిందే. ఈ పర్యటనలో రెండో రోజులో భాగంగా వైద్య సిబ్బందికి వైద్యంపై మరింత అవగాహన కల్పించారు. కేంద్ర బృందం, డాక్టర్ నిమిత్ కుమార్ మాట్లాడుతూ సమయానికి విధులకు హాజరుకావాలని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శశికాంత్, రవిచంద్రశేఖర్, ఆరోగ్య విస్తరణాధికారి నడిగట్ల ప్రకాష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జల్ జీవన్ మిషన్ పథకం పనుల్లో నాణ్యత ఉండాలి

విశాలాంధ్ర - ఎస్. రాయవరం : జల్ జీవన్ మిషన్ పథకం పనుల్లో నాణ్యత ఉండాలని ఆర్ డబ్ల్యూ ఎస్ అధికారి వెంకట్రావు సూచించారు. బుధవారం ఎస్.రాయవరం మండల కేంద్రంలో జరిగిన ఇంటింటి కుళాయిలు నిర్మాణంలో భాగంగా కొత్తగా నిర్మాణం అవుతున్న వాటర్ ట్యాంక్ పనులను పరిశీలించారు. నిబంధనల ప్రకారం పనులు చేయాలని లేదు అంటే చర్యలు తప్పవని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఆనంద్, జెఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్యాచౌలి జెల్ బార్‌ని లాంచ్ చేసిన ఐటీసీ ఫియామా

విశాలాంధ్ర - విశాఖ సిటీ: అంతర్జాతీయ స్థాయి బ్రాండ్ ఐటీసీ యొక్క ఫియామా, భారతదేశంలోని ప్రముఖ పర్సనల్ వాష్ బ్రాండ్ ప్యాచౌలి శాండల్‌వుడ్ ఆయిల్ ప్యాచౌలి జెల్ బార్‌లను ప్రారంభించింది. బాత్ సోప్ విభాగంలో సరికొత్త ఆవిష్కరణ దిశగా దూసుకుపోతుందని ఐటీసీ లిమిటెడ్ పర్సనల్ కేర్ ప్రాడక్ట్స్ బిజినెస్ డివిజన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ సమీర్ సత్పతి చెప్పారు. ఐటీసీ ఫియామా శాండల్ సోప్ ఆధునికతకు అద్దం పడుతుందని అన్నారు.

సచివాలయ వ్యవస్థతో ప్రజలకు చేరువైన పరిపాలన : ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

విశాలాంధ్ర - జీ.కే వీధి : ముఖ్య మంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థ వలన ప్రజలకు పాలన చేరువైందని పాడేరు శాసనసభ్యురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. సంకాడ గ్రామ సచివాలయాన్ని సీనియర్ నాయకుడు, పెద్దాయన మామిడి చంద్రరావు చేతుల మీదుగా ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పా టుతో గతంలో ప్రజలందరూ ఎప్పుడూ పొందనటువంటి అనేక సేవలను పొందగలు గుతున్నారన్నారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు ద్వారా డిగ్రీ, డిప్లమో, పీజీ లాంటి విద్యార్హతలు ఉన్న నిరుద్యోగులకు ఆంధ్రప్రదేశ్ లోనే ఉద్యోగాలు ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించడ మనేది నిజంగా శుభ పరిణామం అన్నారు. మన పిల్లలే మన సచివాలయాలలో ఉద్యోగాలు చేస్తూ మన ప్రజలకు అద్భుతమైన సేవలు అందిస్తున్నందుకు వాళ్ళందరికీ ధన్యవాదాలు తెలియజే స్తున్నామన్నారు. ఈ సచివాలయం పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కూడా ఇదివరకే నిర్వహించడం జరిగిందని ఆయా కార్యక్రమం నిర్వహించినప్పుడు ప్రజల తెలియజేసినటువంటి సమస్యల పరిష్కారానికి సంబంధించి ప్రతిపాదనలు కూడా అధికారులకు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోయిన కుమారి, స్థానిక సర్పంచ్ దేశగిరి నాగులమ్మ,, వైస్ ఎంపీపీలు దేవుడు, ఆనంద్, వైకాపా మండల అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్, నాయకులు కంకిపాటి గిరిప్రసాద్, అరికట్ల అంజి, వి. ఆనందరావు, మొట్టడం లక్ష్మణరావు, దేశగిరి కృష్ణ పడాల్, జర్తా బాలరాజు, గబులంగి అప్పారావు, ముర్ల కోటేశ్వర రావు, కార్యకర్తలు, వివిధ శాఖలకు చెందిన మండల అధికారులు, వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగిసిన సెయింట్ ఆన్స్ ఫీస్ట్ వారోత్సవాలు

విశాలాంధ్ర - మల్కాపురం : జూలై 26 న, మేరీ మాత మాతృ మూర్తి అయిన సెయింట్ ఆన్స్ జన్మదినాన్ని పురస్క రించుకొని, ఈనెల 19వ తేదీ నుండి 26వ తేదీ వరకు సెయింట్ ఆన్స్ వారోత్సవాలను ఘనంగా సెయింట్ ఆన్స్ కళాశాలలో నిర్వహించారు. అనేక కార్యక్రమాలను వారం రోజులపాటు ఉత్సాహంగా ఏర్పాటు చేశారు. 19వ తేదీన సెయింట్ ఆన్స్ పతాకాన్ని ఆవిష్కరించి, కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్ల మాట్లాడుతూ- సున్నితత్వం సంసిద్ధత మరియు సేవ సెయింట్ ఆన్స్ లక్ష్యాలని అన్నారు. 20వ తేదీన చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. 21వ తేదీన నాటిక పోటీలను 22వ తేదీన డాన్స్ పోటీలను నిర్వహించారు. 23వ తేదీన మదర్ తెరిసా వృద్ధుల ఆశ్రమం లో , డాన్ బాస్కో స్కూల్లో మరియు పెందుర్తిలోని లయోలా వృద్ధాశ్రమంలో సేవా కార్య క్రమాలను నిర్వహించారు. అనాథలకు, వృద్ధులకు పండ్లు,రొట్టెలు పంచిపెట్టారు. పేదలకు అన్నదానం చేశారు. 24వ తేదీన వక్తృత్వ పోటీని నిర్వహించారు. 25వ తేదీన ఘనంగా బహుమతి ప్రధానోత్సవం జరిగింది. సాంస్కృతిక కార్యక్రమాలను విద్యార్థులు ప్రదర్శించారు. 26వ తేదీన సిస్టర్స్

ప్రార్థనలో నిమగ్నమయ్యారు. దేశ సంక్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ మొత్తం కార్యక్రమాలను సెయింట్ ఆన్స్ కళాశాల యాజమాన్య ప్రతినిధులు, అధ్యాపకులు మరియు విద్యార్థినిలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి ఆధ్వర్యంలో ఈ వుత్సవాలు విజయవంతంగా ముగిశాయి.

పంట నమోదు పై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - రాజవొమ్మంగి : రాజవొమ్మంగి తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం విఆర్ఓ లకు, గ్రామ వ్యవసాయ సహాయకులకు, ఈ క్రాప్ 2023 ఖరీఫ్ సీజన్ పంట నమోదుపై అవ గాహన కల్పించినట్లు మండల వ్యవశాఖాధికారి పి రమేష్ నాయుడు తెలిపారు, పంట నమోదుకు క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించాలని, ఈ క్రాప్ నమోదుపై రైతులకు అవగాహన కల్పించాలని, నమోదులో ఎటువంటి తప్పిదాలు లేకుండా చూడాలని, రైతులందరు ఈకెవైసీ చేయించుకునేల అవగాహన కల్పించాలని తెలిపారు, ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్రమణ్యచారి పాల్గొన్నారు.

భవిష్యత్ గ్యారంటీ బిసిల భరోసా బాట కార్యక్రమం

విశాలాంధ్ర - మాకవరపాలెం : తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజారపు అచ్చెం నాయుడు, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, బిసి ఫెడరేషన్ అధ్యక్షులు కొల్లు రవీంద్ర, మాజీ మంత్రి, పొలిట్‌బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు, అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షులు బుద్ద నాగజగదీశ్వరరావు ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ బిసి యాత సాధికారత రాష్ట్ర కన్వీనర్ ఒనుం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం మాకవరపాలెం మండలం మాకవరపాలెం గ్రామం దుర్గాదేవి గుడి వద్ద మండల స్థాయి భవిష్యత్తు గ్యారెంటీ బీసీల భరోసా బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒనుం శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలపై భారాల మోపుతూ ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి మోసం చేశారన్నారు. జగన్ హయాంలో రాష్ట్రం ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఈ ప్రభుత్వ దుర్మార్గపు విధానాన్ని రూపుమాపాలని, రానున్న రోజుల్లో మళ్లీ చంద్రబాబునాయుడుని ముఖ్యమంత్రి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి నాయకులు వనం గణేష్, దుంగ సతీష్, చిన్ని సత్తయ్య, పట్నాల వెంకటరమణ, ఇల్లా రాజు పాల్గొన్నారు.

వైకాపా నిరంకుశ పాలనకు స్వస్తి పలికే సమయం ఆసన్నమైంది

తెదేపా అరకు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి జ్ఞానేశ్వరి

విశాలాంధ్ర - జీకేవీధి : వైకాపా నిరంకుశ పరి పాలనకు స్వస్తి పలికే సమయం ఆసన్నమైందని తెదేపా అరకు పార్లమెంట్ కార్య నిర్వాహక కార్యదర్శి చల్లంగి జ్ఞానేశ్వరి అన్నారు. మండలంలోని సప్పర్ల కొత్తూరు గ్రామాల్లో ఆ పార్టీ మండలాధ్యక్షుడు ముక్కలి రమేశ్ ఆధ్వర్యంలో మహాశక్తి ర్యాలీ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ ఒక్క అవకాశం అంటూ అధికారంలోకి వచ్చిన వైకాపా అధినేత, ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి గడచిన నాలుగేళ్లలో ప్రజలకు నరకం చూపించారన్నారు. ప్రచార ఆర్భాటం మినహా, అభివృద్ధి, సంక్షేమాలను పూర్తిగా విస్మరించారన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రశ్నిస్తున్న ప్రతిపక్షంపై అక్రమ కేసులు బనా యిస్తున్నారన్నారు. వైకాపా ప్రభుత్వానికి పతనం ప్రారంభమైందన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఆదివాసీలు, అధికార పార్టీ ప్రజా ప్రతినిధులను అడుగడుగునా అడ్డుకుంటున్నారన్నారు. తెదేపా అధినేత ప్రకటించిన మహాశక్తి మేనిఫెస్టోపై ప్రజలు చైతన్యవంతులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యురాలు గంటా నళిని, చింతపల్లి మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు, నాయకులు కోడా సురేశ్ కుమార్, షేక్ కాసిం వల్లి, ముర్ల కోటేశ్వరరావు, కోరాబు స్వర్ణ, ఆంద్రాబు లక్ష్మణరావు అధిక సంఖ్యలో కార్యకర్తలు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఏకగ్రీవ పంచాయతీలకు ప్రోత్సాహక నిధులు విడుదల చేయండి

విశాలాంధ్ర - మాకవరపాలెం : ఏకగ్రీవ పంచాయతీలకు ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహక నిధులు విడుదల చేయాలని మాకవరపాలెం మండలం నారాయణరాజుపేట సర్పంచ్ పీలా వరలక్ష్మీ కోరారు. ఈ సందర్భంగా డిపిఓ శిరీషా రాణికి వరలక్ష్మీ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ వరలక్ష్మీ మాట్లాడుతూ సుమారు రెండున్నరేళ్లు కావస్తున్నా ఇప్పటికీ నిధులు మంజూరు కాలేదన్నారు. ఈ నేపథ్యంలో పంచాయతీలో అభివృద్ధి పనులు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నామని, ప్రోత్సాహక నిధులను అందజేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో సూరిబాబు పాల్గొన్నారు.

దారకొండ ఘాట్‌లో నిలిచిన సీలేరు నైట్‌హాల్ట్ బస్సు

విశాలాంధ్ర - సీలేరు : సీలేరూ విశాఖపట్నం నైట్ హాల్ట్ బస్సు దారకొండ ఘాట్ రోడ్డులో నిలిచి పోయింది. బుధవారం ఉదయం 6 గంటలకు సీలేరు నుండి విశాఖపట్నం బయలుదేరిన బస్సు సాంకేతిక లోపం కారణంగా దారకొండ ఘాట్ వద్ద ఆగిపోయింది. దీంతో ప్రయా ణికులు ఇబ్బందులు పడ్డారు. తరచూ ఘాట్ రోడ్లలో బస్సులు నిలిచి పోవడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కండీషన్‌లో లేని బస్సులను తిప్పడం వల్లే ఈ విధంగా నిలిచిపోతున్నాయని ప్రయాణికులు అంటున్నారు. ఇప్పటికైనా కండీషన్‌లో ఉన్న బస్సులను తిప్పాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రకృతి పద్ధతులలో నాట్లు వేయాలి

విశాలాంధ్ర - జిమాడుగుల : మండల ఎం.నిట్టపోటు గ్రామంలో బుధవారం రైతులతో వరిలో లైన్ షోయింగ్ నాట్లు వేయించిన ప్రకృతి సిబ్బంది" యూనిట్ ఇన్చార్జి ప్రసాద్ పాపారావు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం పద్ధతులలో వరి నాట్లు వేయడం వలన కలుపు బాగా తేలిపోతుందని వారి అధిక దిగుబడి వస్తుందని రైతులకు వివరించారు.

మండలంలో భారీ వర్షం

విశాలాంధ్ర - దుంబ్రిగూడ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా దుంబ్రిగూడ మండలంలోని భారీ వర్షం కురిసింది. ఏటువంటి ఎడతెరిపిలేని వర్షాలు బుధవారం కురవడంతో మండలంలో గల వాగులు వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ఏదేమైనాప్పటికీ వర్షాలు పడడంతో వ్యవసాయ రైతులకు ఉరట నివ్వక తప్పలేదు.

మణిపూర్ ఘటనకు నిరసనగా ర్యాలీ

విశాలాంధ్ర - రాజవొమ్మంగి : మణిపూర్ ఘటనకు నిరసనగా క్రిస్టియన్, ముస్లిం, హిందు సంఘాల నాయ కులు బుదా వారం రాజవొమ్మంగిలో ర్యాలీ చెపట్టారు, మణి పూర్‌లో మహిళలకు, పిల్లకు రక్షణ కలిపించాలని, రాష్ట్రం వదిలిపోయిన గిరిజనులను వెనక్కి తీసుకు రావాలని, అత్యాచార బాధితులను ఆదుకోవాలని, నిదుతులను కఠినంగా శిక్షించాలని, ఇల్లు కోల్పోయిన వారిని వెంటనే ప్రభుత్యం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముస్లిం నాయకులు మహ్మద్ అలీ, పాస్టర్ చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

నాడు ఆలా... నేడు ఇలా

అలుగు ప్రాజెక్టుకి భారీ వరద

విశాలాంధ్ర - ఎటపాక : ఎటపాక మండలం బాస వాగు ప్రాజెక్టుకి భారీ వర్షాల కార ణంగా భారీ వరద చేరి జలకల సంతరించు కుంది. నాడు వేసవిలో పూర్తి గా చుక్క బొట్టు నీరు లేకుండా కనిపించిన ప్రాజెక్టు నేడు నిండు వరద తో జలకళలాడుతోంది. ప్రాజెక్టు వరద రావడం తో వ్యవసాయనికి సాగునీరు అందిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

7వ వార్డులో టీడీపీ ఓటర్ల పరిశీలన

విశాలాంధ్ర - మధురవాడ : భీమిలి నియోజక వర్గం ఇంచార్జ్ శ్రీ కోరాడ రాజబాబు,7వ వార్డు కార్పొరేటర్ పిల్లా మంగమ్మ , ఏడ వార్డు అధ్యక్షులు పిల్ల నరసింహా రావు ఆదేశాల మేరకు మధురవాడలో ఆదిత్య నగర్ మరియు స్వతంత్ర నగర్ నాగోతి సూర్యప్రకాష్ యూనిట్ ఇంచార్జి ఆధ్వర్యంలో 310, 312 బూత్ ఓటర్ ఫరిశీలనా కార్యక్రమా అన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమం లోబూత్ కన్వీనర్లు శ్రీను, బైపిల్లి శ్రీరామ్ మూర్తి, బీయల్వో లు, మల్లికార్జున్, రూప రేఖ సమక్షంలో ఓటర్ వెరిఫికేషన్ చేయడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా (టీయస్టియూసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతి శివాజీ, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖపట్నం పోర్టు అధారిటీని సందర్శించిన ట్రైన్ ఐఏఎస్‌ల బృందం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : స్టడీ టూర్‌లో భాగంగా పదిమంది సభ్యుల ట్రైనీ ఐఏఎస్‌ల బృందం విశాఖపట్నం పోర్టు అధారిటీని బుధవారం సందర్శించింది. వీపీఏ డిప్యూటీ చైర్ పర్సన్ దుర్గేష్ కుమార్ దూబె ట్రైనీ ఐఏఎస్‌ల బృందానికి సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోర్టులో జరుగుతున్న ఎగుమతి, దిగుమతి కార్యకలాపాలు, పోర్టులో జరుగుతున్న అభివృద్ధి పనులు, యాంత్రికరణ, ఆధునికీకరణ, పర్యావరణ పరిరక్షణ కోసం చేపడుతున్న కార్యకలాపాలు, కవర్డ్ స్టోరేజీ యార్డు నిర్మాణం, సోలార్ పవర్, క్రూయిస్ టెర్మినల్ నిర్మాణం వంటి పనులను డిప్యూటీ చైర్మన్, ట్రైనీ ఐఏఎస్‌ల బృందానికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పోర్టులో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించటంతో పాటుగా, అనేక విషయాలను తమతో పంచుకున్న పోర్టు డిప్యూటీ చైర్మన్‌కు విభాగాధిపతులకు ట్రైనీ ఐఏఎస్‌ల బృందం ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోర్టు విభాగాధిపతులు అధికారులు పాల్గొన్నారు.

తెలుగు యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా లోకా లోవరాజు నియామకం

విశాలాంధ్ర - నర్సీపట్నం : నర్సీపట్నం : తెలుగు యాదవ మహాసభ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నర్సీపట్నానికి చెందిన ప్రముఖ న్యాయవాది లోకా లోవరాజు యాదవ్ నియమితులయ్యారు. ఇటీవల విజయవాడలోని క్యూ వన్ హెటల్ లో జరిగిన సమావేశంలో తెలుగు యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కోన గురవయ్య యాదవ్ లోవరాజు నియామకాన్ని ప్రకటించారు. ఈ మేరకు నియామక పత్రాన్ని బుధవారం టివైఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గురవయ్య యాదవ్ లోవరాజుకు అంద జేశారు. ఈ సందర్భంగా లోకా లోవరాజు మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఇటువంటి బృహత్తరమైన బాధ్యత తనకు అప్పగించినందుకు మహాసభ రాష్ట్ర అధ్యక్షునికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే తన సారథ్యంలో జిల్లా, నియోజకవర్గ, మండల కమిటీల నియామకం చేపడతామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈగల వెంకట అప్పారావు(బంకు అప్పారావు), పిల్లా వెంకటేశ్వరరావు, పల్లా కృష్ణ, మురుకుర్తి ఈశ్వరరావు, బర్ల కృష్ణంరాజు, ఈగల రమణ, నమ్మి రాజబాబు, మొల్లి గోవింద, సబ్బి నూకరాజు, పట్నాల శ్రీను పాల్గొన్నారు.

రోడ్ సౌకర్యం కల్పించాలని కలెక్టర్‌కు టీడీపీ శ్రేణులు వినతి

విశాలాంధ్ర - దుంబ్రిగూడ : పోతంగి పంచాయతీ పరిధిలోనున్న పలు గ్రామాలకు తారు రోడ్డు మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ అల్లూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే పాల్గుణ కు మండల దేశం పార్టీ నాయకులు బుధవారం వినతి పత్రాన్ని సమర్పించారు. మండల హెడ్ క్వార్టర్ అయిన పోతంగి పంచాయతీలోని చెలిమర వలస నుండి రంగిని వలస వరకు చాపు రాయి జలపాతం నుండి పెదపాడు గ్రామం వరకు తారు రోడ్లు మంజూరు చేయాలని, బిజీమర వలస, నంది వలస గ్రామ గిరిజనులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని, అలాగే దుంబ్రిగూడ గ్రామంలోని సిసి రోడ్డు డ్రైనేజీ కాలువలు మంజూరు చేయాలని వినతిలో పేర్కొన్నారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ సుమిత్ కుమార్ ఆయా పనుల మంజూరుకు ప్రతిపాదనలు పంపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేశం పార్టీ మండల అధ్యక్షులు టి సుబ్బారావు టిఎన్టియు ప్రధాన కార్యదర్శి ఎం స్వామి ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి కే సుబ్బారావు,మాజీ ఎంపీపీ కే దనేరావు పాల్గొన్నారు.

200 మందికి ఉచిత వైద్య పరీక్షలు

విశాలాంధ్ర - వి.ఆర్.పురం : రిపోర్టర్ స్వర్గీయ బండి రామకృష్ణ జ్ఞాపకార్థం వరద ప్రభావిత ప్రాంతాల్లో వివేకానంద ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో బాలచంద్ర మెమోరియల్ ఉన్నత పాఠశాల తిరుపతి,.. జమాల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్.. దర్శి వారి సహకారంతో మండలంలోని వడ్డీ గూడెం గ్రామంలో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో దాదాపు 200 మంది రోగులకు వైద్యుడు సుందర్ ప్రసాద్ వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు రోగులు మాట్లాడుతూ వరదలు చుట్టుముట్టి, కురుస్తున్న వానలకు నానా అవస్థలు పడుతున్నమని, బయటకు వెళ్లి వైద్యం చేయించు కొలేని పరిస్తితిలో ఉన్న మాకు ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్యం అందించటం చాలా సంతోషించ తగ్గ విషయమని, ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరున ధన్యవాదాలు తెలుపుతున్నామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో వివేకానంద ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సత్తిబాబు. సహాయ కార్యదర్శి .దన్నాన రామారావు. కోశాధికారి. కృపారావు. ఎడ్ల. విజయరాజు, కోట్ల. నరేష్, బి.అరుణ్ గణేశ్. సైదారెడ్డి. మాజీ జడ్పిటిసి ముత్యాల రామారావు, బొర్రా దుర్గారావు తదితరులు పాల్గొన్నారు

విద్యా బోధనలో సృజనాత్మకత అవసరం

విశాలాంధ్ర - దేవీపట్నం : ఆధునిక విద్యా బోధనలో సృజనాత్మకత ఎంతో అవసరమని మండల విద్యాధికారి 2శీర్షం బాలు దొర అన్నారు. దేవీ పట్నం స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులకు రెండు రోజులు శిక్షణా కార్యక్రమంలో భాగంగా బుధవారం శిక్షణా శిబిరంను సందర్శించారు. పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న బోధనా పద్ధతులు లో మెళకువలు సూచనలు ఉపాధ్యాయులలో ఎప్పటికప్పుడు వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవాలని ఈ శిక్షణలు ఎంతో దోహదం చేస్తాయని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నూకరాజు అన్నారు దేవీ పట్నం కొండ మొదలు కాంప్లెక్స్‌లకు చెందిన ఉపాధ్యాయులకు మోరల్ లెసన్స్ బోధనా కృత్స ములతో బోధన చేశారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు కృత్సములను ప్రదర్శించారు. కాంప్లెక్స్ సెక్రెటరీ జి.రత్నమాల రాజు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

విశాలాంధ్ర - హుకుంపేట : ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల వల్ల మురుగు నీళ్లు నిలువ ఉండి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానిక పంచాయతీ సర్పంచి సమిడ వెంకట పూర్ణిమ సూచించారు. పరిశుభ్రంగా ఉన్నపుడే వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. ఇందులో భాగంగా నే పంచాయతీలో పారిశుధ్య పనులు చేపడుతున్నామని చెప్పారు. అలాగే పలుచోట్ల డస్ట్ బిన్లు కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజలు చెత్తను ఆ డస్ట్ బిన్లలో వేయాల ని విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని ప్రతీ దుకాణం వద్ద డస్ట్ బిన్లు ఏర్పాటు చేయాలని దుకాణాల యజమాను లకు సూచించారు. దుకాణాల వద్ద డస్ట్ బిన్లు లేకపోవడం వల్ల, ప్లాస్టిక్ తదితర వ్యర్థ పదార్థాలు డ్రైనేజీల్లో వేస్తున్నారని, దీనివల్ల ఎప్పటికప్పు డు పారిశుధ్య సమస్య ఏర్పడుతుం దని పేర్కొన్నారు. దుకాణదారులు ఖచ్చితంగా తమ దుకాణాల వద్ద డస్ట్ బిన్లు ఏర్పాటు చేయాలని, లేకుంటే పంచాయతీ చర్యలు ఉంటుందని ఆమె హెచ్చరించారు. పంచాయతీ పరిశుభ్రతకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని ఆమె కోరారు కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాగర్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైన చోడవరం విద్యార్థులు

విశాలాంధ్ర - చోడవరం : అనకాపల్లి జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 25 తేదీన పరవాడ మండలం వెన్నెల పాలెంలో జరిగిన జిల్లా స్థాయి యోగ పోటీల్లో చోడవరం పతంజలి యోగా శిక్షణ కేంద్రం విద్యార్థులు ఎంపిక అయినట్లు యోగా గురువు పుల్లేటి సతీష్ బుదవారం మీడియాకు తెలిపారు. పతంజలి శిక్షణా కేంద్రంలో యోగ విద్యను అభ్యసిస్తున్న 9 నుండి 14 సంవత్సరాల బాలురు విభాగంలో వి. హరి దుర్గ - సిల్వర్ మెడల్, జి. హేమంత్ శ్రీను - నాలుగవ స్థానం, ధనుష్ 5వ స్థానం 14 నుండి 18 సంవత్సరాల బాలురు విభాగంలో పి. క్రాంతి సాగర్ గోల్డ్ మెడల్ జి.లయ వర్ధన్ సిల్వర్ మెడల్ పి. పవన్ కుమార్ బ్రాంజ్ మెడల్ వి. పూర్ణచంద్రరావు నాలుగవ స్థానం 14 నుంచి 18 సంవత్సరాల బాలికల విభాగంలో పి. వెన్నెల శ్రీ సిల్వర్ మెడల్ రిథమిక యోగాలో మల్ల. శ్రీహిత సిల్వర్ మెడల్ 18 నుండి 28 సంవత్సరాల బాలుర విభాగంలో కొట్టాపు హరి కిరణ్ గోల్డ్ మెడల్ సాధించి ఆగస్టులో విజయవాడలో జరగబోయే రాష్ట్ర స్థాయి యోగ పోటీలకు ఎంపికైనట్లు యోగ గురువు సతీష్ తెలిపారు. విజేతలను యోగా కేంద్రం అధ్యక్షులు పసుమర్తి అశోక్ యోగా టీచర్ బోగవిల్లి గణేష్ లాయర్ శ్రీనివాస్ రెడ్డి అప్పారావు బోగవిల్లి రవితేజ యోగా కేంద్ర సభ్యులు చోడవరం ప్రముఖులు ప్రజలు అభినందించారు

వారోత్సవాల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తం

విశాలాంధ్ర - కొయ్యూరు : సీపీఐ మావోయిస్ట్ వారోత్సవాల నేపథ్యంలో కొయ్యూరు మంప పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ నెల 28 నుండి ఆగస్టు 3 వరకు సీపీఐ మావోయిస్టుల వారోత్సవాలు జరగనున్న నేపథ్యంలో పోలీసు యంత్రాంగం అప్రమత్తమయింది. ప్రధాన కూడళ్ళు, స్టేషన్ల సముదాయం వద్ద వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. వారోత్సవాలను పురస్కరించుకొని మావోయిస్టులు ఎటువంటి దుశ్చర్యలకు పాల్పడకుండా ఉండే విధంగా ముందస్తు ప్రతిష్ట చర్యలు చేపడుతున్నారు. వాహన తనికిలతో పాటు సరిహద్దు అటవీ ప్రాంతంలో ప్రత్యేక పోలీసు బలగాలతో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. వారోత్సవాలను పురస్కరించుకొని మావోయిస్టులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా ఉండే విధంగా అప్రమత్తమైన పోలీసులు వారపు సంతల పై దృష్టి సారించారు. ప్రధాన కూడళ్ళు ప్రభుత్వ కార్యాలయాల వద్ద రహస్య గస్తీ నిర్వహిస్తున్నారు. మావోయిస్టుల ఆచూకీకై ఆరా తీస్తూ అపరిచిత వ్యక్తుల కదలికలపై నిఘా ఏర్పాటు చేశారు. అనుమానిత వ్యక్తులను ప్రశ్నించి వదలటంతో పాటు వారి కదలికలపై దృష్టి సారిస్తున్నారు.

'జగనన్న సురక్ష' పేదలకు రక్ష : ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ

విశాలాంధ్ర - హుకుంపేట : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగ నన్న సురక్షతో పేదలకు రక్ష అని అరుకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. బుధ వారం మండలంలోని తాడిపుట్టు సచివాలయ కేంద్రంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో 449 మందికి ధృవ పత్రాలు పంపిణి చేశారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు గిరిజ నుల సమస్యలు తెలుసుకున్న ప్రభు త్వం జగనన్న ప్రభుత్వం అన్నారు. గిరిజనులు ఏ విధమైన సమస్య లతో ఇబ్బందులు పడకూడదన్న లక్ష్యంతో ఈ సురక్ష పథకం ఏర్పాటు చేశారన్నారు. ఈ పథకం 'ద్వారా 11రకాల ధృవపత్రాలు పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవా లన్నారు. మట్టుజోరు సచివాలయం లో నిర్వహించిన సురక్ష కార్యక్ర మంలో జేడ్పిటీసీ సభ్యుడు రేగం మత్యలింగం పాల్గొని జెడ్పిటిసి చేతుల మీదుగా 189 ధృవప త్రాలు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాజలక్ష్మి ఎంపిడీవో వెంకటరావు, ఈవోపీఆర్డి అశోక్, అర్ఐ రంరగారవు, పంచాయతీ రాజ్ ఏఈఎస్ సంజీవరావు, ఐసిడిఎస్ సీడీపీఓ బాలచంద్ర మని దేవి, ఎస్‌సిఎస్ మండల ఇన్చార్జి కే.రామకృష్ణ, ఎంపీటీసీ సింహాచలం, సర్పంచులు సాంబ, సోమేలి సత్యవతి, సచివాలయ సిబ్బంది స్థానిక నాయకులు కేచిన్నబి, వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

కార్గిల్ విజయ్ దివస్ జరుపుకున్న ఐఎన్ఎస్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : కార్గిల్ విజయ్ దివస్ 24వ వార్షికోత్సవం సందర్భంగా తూర్పు నౌకాదళ కమాండ్ మన దేశం కోసం పోరాడి ప్రాణాలు అర్పించిన మన వీర జవాన్లకు నివాళులర్పించింది. వైస్ అడ్మిరల్ సంజయ్ వాత్సయన్ 'విక్టరీ ఎట్ సీ' వార్ మెమోరియల్ విశాఖపట్నంలో జరిగిన పుష్పాంజలి కార్యక్రమంలో కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న వీర జవాన్లకు నివాళులర్పించారు. నేవీ ఫౌండేషన్ వైస్ అడ్మిరల్ వీకే నంబాళ్ల (రిటైర్డ్), జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, జిల్లా సైనిక్ వెల్ఫేర్ అధికారి సత్యానందం, మాజీ సైనికులు పుష్పగుచ్చాలు ఉంచారు.

పెరుగుతున్న వరద గోదావరి

కాఫర్ డ్యామ్ పెరుగుతున్న నీటి మట్టం

విశాలాంధ్ర - దేవీపట్నం : గోదావరి ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు తోడు గోదావరి ఉప నదులైన శబరి సీలేరు ఉప్పొంగి ప్రహించటంతో పోలవరం ప్రాజెక్టు కాఫిర్ డ్యామ్ వద్ద గోదావరి వరద నీటి మట్టం గంట గంటకు క్రమేపీ పెరుగుతూ వస్తోంది. దేవీ పట్నం మండలంలో పోలవరం ప్రాజెక్టు పరివాహక ప్రాంతంలో గోదావరి నీటిమట్టం పెరిగి నిండుకుండను తలపిస్తోంది. మరో పక్క కొండ మొదలు శివారు తాళ్లూరు గ్రామం ఇంకా గోదావరి వరద నీటి లోనే ఉంది.ఆ గ్రామస్తులు గ్రామాన్ని ఖాళీ చేసి సురక్షిత ప్రాంతానికి కొండల్లో తలదాచుకుంటూన్నారు. అధికారులు వారికి అవసరమైనా నిత్యవసర వస్తువులను తరలించి వారికి అందజేస్తున్నారు. గోదావరి నది తీరం లో ఉన్న మాతృశ్రీ గండి పోశమ్మ ఆలయం పూర్తిగా నీట మునిగి పోయింది. మరో పక్క గోదావరి పరివాహక ప్రాంతంలోకి ఎవ్వరూ చేపలు వేటకు గానీ ఇతరత్రా కారణాలతో ఎవ్వరూ వెళ్ళ కూడదనే పోలీస్ ఆంక్షలతో అటుగా ఎవ్వరు వెళ్లకుండా దేవీ పట్నం ఎస్ ఐ నాగార్జున నేతృత్వంలో పోలీసులు పహారా కాస్తున్నారు. కాగా దేవీపట్నం లోని పోలవరం ముంపు గ్రామాలన్నీ పునరావాసం లో తరలించడంతో వరద ముంపు ప్రజలకు తప్పింది.

ఇంటింటికీ తాగునీటి కుళాయి : సర్పంచ్ సూర్యకుమారి

విశాలాంధ్ర - రావికమతం : మండలంలో కవగుంట గ్రామపంచాయతీకి మంజూరైన జలజీవన్ పథకానికి సంబంధించిన ఇంటింటి కొళాయి పైపు గ్రామానికి చేరుకోవడం జరిగిందని సర్పంచ్ దాసరి సూర్యకుమారి వరహాలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ చోడవరం శాసన సభ్యులు కరణం ధర్మశ్రీ సహకారంతో గ్రామానికి జలజీవన్ పథకం ద్వారా 41 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేసి ఇంటింటికి కొలాయి అందించే దిశగా అడుగులు వేయడం జరిగిందన్నారు. అలాగే గ్రామంలో 20,000 లీటర్లు గల రక్షిత మంచినీటి ట్యాంక్ అలాగే సుమారు కిలోమీటర్నర మేర ఇంటింటి కొళాయి పైపు లైను వేయడం జరుగుతుందన్నారు. తద్వారా ప్రతి ఇంటికి ఉచితంగా మంచినీరు అందించే పరిస్థితి ఉంటుందన్నారు. దీనికి సంబంధించి ఖర్చు మొత్తం ప్రభు త్వమే భరిస్తుందని అన్నారు. కాబట్టి ఇటువంటి మంచి పథకాన్ని ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాడు మాజీ మంత్రివర్యులు బలిరెడ్డి సత్యారావు మంజూరు చేసిన రక్షిత మంచినీటి పథకం ఒక్కటే నేటికీ ప్రజలందరికీ మంచి నీటి సౌకర్యాన్ని అందించి ప్రజల దాహాన్ని తీరుస్తుందన్నారు. దివంగత మాజీ శాసనసభ్యులు బలిరెడ్డి సత్యారావు, ముక్కా మహాలక్ష్మి నాయుడు ఆధ్వర్యంలో గ్రామం అన్ని విధాల అభివృద్ధి పథంలో నడిచింది అన్నారు. తరువాత వచ్చిన పాలకులు గ్రామం వైపు కన్నెత్తి చూడకపోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అయితే ఈ ట్యాంకు పూర్తిస్థాయిలో ప్రజలందరికీ మంచినీరు అందించే పరిస్థితి లేకపోవడంతో దీనిని గుర్తించిన సర్పంచ్ స్థానిక శాసన సభ్యులు కరణం ధర్మశ్రీ దృష్టికి తీసుకువెళ్లగా తక్షణమే నిధులను మంజూరు చేసి వాటర్ ట్యాంకు పైపులైను ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు.